క్లుప్తంగా

ప్రజలకు శివరాత్రి శుభాకాంక్షలు: ఎమ్మెల్యే ఆర్కే



మంగళగిరి: నియోజకవర్గ ప్రజలకు ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) శుక్రవారం శివరాత్రి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలు ఆనందంగా పండుగ జరుపుకోవాలని ఆకాంక్షించారు. మహా శివుని ఆశీస్సులతో నియోజకవర్గంలోని పేద ప్రజలకు మెరుగైన సంక్షేమ పథకాలు అందిస్తున్నామని పేర్కొన్నారు.

ఇటలీలో ఉన్నత విద్యకు మెరుగైన అవకాశాలు



కెమిల్లా ఆంద్రియాని

తాడేపల్లి రూరల్: ఇటలీలో ఉన్నత విద్యనభ్యసించేందుకు పడువా విశ్వవిద్యాలయం అన్ని సదుపాయాలు కల్పిస్తున్నట్లు ప్రతినిధి కెమిల్లా ఆంద్రియాని పేర్కొన్నారు. స్థానిక వడ్డేశ్వరం కేఎల్ వర్సిటీని శుక్రవారం సందర్శించారు. ఆమెకు వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారథి వర్మ స్వాగతం పలికారు. అనంతరం ఆమె విద్యార్థులతో మాట్లాడుతూ ప్రత్యేకమైన ఉపకార వేతనాలను అందిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ ఎ.జగదీష్, ఎం.హెచ్ఎస్.డీన్ డాక్టర్ ఎం.కిషోర్‌బాబు పాల్గొన్నారు.

పైపులైన్లకు మరమ్మతులు

తాడేపల్లి రూరల్: ఎంటీఎంసీ పరిధిలోని మంగళగిరి- ప్రకాశం బ్యారేజ్ పాత జాతీయ రహదారి రోడ్డులో పైపులైన్ల పగిలి తాగునీరు వృథాపై సచివాలయ సిబ్బంది ఇచ్చిన ఫిర్యాదు మేరకు శుక్రవారం మరమ్మతులు నిర్వహించారు. దీంతో నులకపేట, బ్రహ్మానందపురం, బాబా జగ్జీవన్‌రామ్ కాలనీలకు తాగునీటిని ట్యాంకర్ల ద్వారా సరఫరా చేశారు.

దోమల నివారణకు చర్యలు

మంగళగిరి: దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని ఆత్మకూరు గణపతినగర్ డాక్టర్ వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యాధికారిణి పి.అనూష పేర్కొన్నారు. ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరోగ్య సిబ్బంది ఇంటింటికి వెళ్లి నీటి నిల్వలను పరీక్షించారు. కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ అధికారి శ్రీమన్నారాయణ, సూపర్‌వైజర్లు సాగర్, ప్రసాద్, హెల్త్ సెంటర్ సూపర్ వైజర్ జయలక్ష్మి పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణ పనులు పరిశీలించాలి

తాడేపల్లి రూరల్: కార్పొరేషన్ పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనులను నిరంతరం సచివాలయ సిబ్బంది పర్యవేక్షించాలని కార్పొరేషన్ డీఈ కృష్ణారెడ్డి ఆదేశించారు. తాడేపల్లి రూరల్ పరిధిలోని కనకదుర్గ వారధి, రేపల్లె కట్ట నుంచి కుంచనపల్లి బీటీ రోడ్ వరకు సిమెంట్ రోడ్డు పనులను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.45లక్షలతో నిర్మించనున్న రోడ్డు నాణ్యత విషయంలో అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. ఆయన వెంట ఏఈ కిషోర్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన

తాడేపల్లి రూరల్: నగరపాలక సంస్థ పరిధిలోని వడ్డేశ్వరం- కొలనుకొండలో రూ.45 లక్షలతో చేపట్టిన రోడ్డు పనులను ఏఈ ప్రవీణ్ శుక్రవారం పరిశీలించారు. ఆయన వెంట సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లు క్రాంతి, సతీష్ పాల్గొన్నారు.

డెల్టాకు 2423 క్యూసెక్కులు విడుదల

దుగ్గిరాల(తాడేపల్లి రూరల్): కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద శుక్రవారం 2423 క్యూసెక్కులు విడుదల చేశారు. హైలెవల్ కాలువకు 137 క్యూసెక్కులు, బ్యాంక్ కెనాల్‌కు 190, తూర్పు కెనాల్‌కు 218, పశ్చిమ కెనాల్‌కు 12, నిజాంపట్నం కాలువకు 206, కొమ్మమూరు కాల్వకు 1179 క్యూసెక్కులు విడుదల చేశారు.

మూలాంకురేశ్వరికి ప్రత్యేక పూజలు



ఫిరంగిపురం: మండలంలోని అమీనాబాద్‌లోని కొండపై కొలువై ఉన్న మూలాంకురేశ్వరి అమ్మకు అర్చకులు అయ్యన్నశాస్త్రి శుక్రవారం విశేష పూజలు నిర్వహించారు. ఉదయాన్నే అమ్మవారికి శ్రీసూక్తంతో పంచామృత అభిషేకాలు నిర్వహించి అష్టోత్తర, సహస్రనామ పూజలు చేశారు. ఆలయ ముఖమండపంలోని అమ్మవారి పాదుకలకు లలితాసహస్రనామాలతో కుంకుమపూజలు చేశారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

వేసవిలో జాగ్రత్తలు తప్పనిసరి

ఫిరంగిపురం: వచ్చేది వేసవికాలం కావడంతో ప్రతి ఒక్కరూ తగిన జాగ్రత్తలు పాటించాలని పంచాయతీ కార్యదర్శి ఏకే బాబు అన్నారు. మండలంలోని వేములూరిపాడు గ్రామంలో శుక్రవారం ఫ్రైడే-డ్రైడే కార్యక్రమం నిర్వహించారు.

మహా శివరాత్రికి శివాలయాలు ముస్తాబు



నులకపేట చైతన్య తపోవన్‌లో మహా శివరాత్రి సందర్భంగా చేసిన ఏర్పాట్లు

తాడేపల్లి రూరల్: మహాశివరాత్రిని పురస్కరించుకుని మంగళగిరి నియోజకవర్గం పరిధిలో శివాలయాలను విద్యుత్ దీపాలతో శుక్రవారం రాత్రి అలంకరించారు. తాడేపల్లి పట్టణ పరిధిలోని బాలా త్రిపుర సుందరీ రాజరాజేశ్వరి సమేత త్రిపుర తాండవేశ్వర స్వామి దేవస్థానం, తాడేపల్లిలోని విశ్వేశ్వరస్వామి దేవాలయం, నులకపేటలోని చైతన్య తపోవనంలో ఉన్న శివాలయం, సీతానగరంలోని పుష్కర ఘాట్‌లో సంగమేశ్వరస్వామి దేవాలయం, సోమేశ్వరస్వామి దేవాలయాలను ఆయా ఆలయాల అధికారులు విద్యుత్ దీపాలతో అలంకరించారు. దుగ్గిరాల, పేరుకలపూడి, పెద్దపాలెం, చిన్నపాలెం, మంచికలపూడి ప్రాంతాల్లో ఉన్న శివాలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. శివాలయాలకు వచ్చే భక్తులకు అన్ని ఏర్పాట్లను ఆయా దేవాలయాల కమిటీ సభ్యులు చేశారు. శివరాత్రి అంటే శివుడికి అత్యంత ప్రీతికరమైన రోజు కావడంతో భక్తులు హరహర మహాదేవ అంటూ పవిత్ర కృష్ణానదీ తీరంలో స్నానమాచరించి, పితృదేవతలకు పిండప్రదాన కార్యక్రమాలు నిర్వహించి శివాలయాలను సందర్శించుకుంటారు.



విద్యుత్ దీపాల అలంకరణలో సీతానగరం సంగమేశ్వరస్వామి దేవాలయం

కేఎల్‌యూలో ఎన్‌సీసీ ప్రాక్టికల్ పరీక్షలు

తాడేపల్లి రూరల్: నగరపాలక సంస్థ పరిధిలోని వడ్డేశ్వరం కేఎల్ విశ్వవిద్యాలయంలో ఎన్‌సీసీ క్యాడెట్లకు ప్రాక్టికల్ పరీక్షలు శుక్రవారం నిర్వహించారు. గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల ఎన్‌సీసీ గ్రూపు కమాండ్ కల్నల్ జయకుమార్ హాజరై మాట్లాడుతూ పరీక్షలకు 606 మంది హాజరయ్యారని అన్నారు. పరీక్షలలో పాస్ అయిన వారికి 19వ తేదీ రాత పరీక్ష కూడా ఉంటుందన్నారు. కార్యక్రమంలో వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారథి వర్మ, కల్నల్ ఆర్.పి.సింగ్, కల్నల్ అజయ్ కుటినో, కల్నల్ కుమార్ ఉమా శంకర్, గుర్నాం సింగ్, అసోసియేట్ ఎన్‌సీసీ అధికారిణులు లెఫ్టినెంట్ ఉషాక్రాంతి, పావని, విశ్వవిద్యాలయ ప్రొ వైస్ చాన్సలర్ డాక్టర్ ఎన్.వెంకటరామ్, రిజిస్ట్రార్ డాక్టర్ ఎ.జగదీష్, విద్యార్థి వ్యవహారాల డీన్ డాక్టర్ చప్పిడి హనుమంతరావు, డీన్ సలహాదారు డాక్టర్ కె.ఆర్.ఎస్.ప్రసాద్, డాక్టర్ హబీబుల్లా ఖాన్, సమన్వయ కర్త చంద్రశేఖర్ పాల్గొన్నారు.



ఎన్‌సీసీ గ్రూప్ కమాండర్‌తో సుబేదార్, కల్నల్, క్యాడెట్లు

పుష్కర ఘాట్లను పరిశీలించిన కమిషనర్

తాడేపల్లి రూరల్: ఎంటీఎంసీ పరిధిలోని సీతానగరం కృష్ణాతీరంలో ఉన్న పుష్కర ఘాట్లను శుక్రవారం రాత్రి ఎంటీఎంసీ కమిషనర్ శారదాదేవి, డీఈ కృష్ణారెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ శారదాదేవి మట్లాడుతూ మహాశివరాత్రి సందర్భంగా విజయవాడ, ఎంటీఎంసీ పరిధిలోని పలు ప్రాంతాల నుంచి పుణ్యస్నానాలు ఆచరించేందుకు భారీ సంఖ్యలో భక్తులు తరలిరానుండడంతో పుష్కర ఘాట్లలో శానిటేషన్ చేయించి వచ్చిన భక్తులు పుణ్యస్నానాలు ఆచరించిన అనంతరం మహిళలు దుస్తులు మార్చుకునే విధంగా గదులు ఏర్పాటు చేశామని చెప్పారు. అలాగే కృష్ణానది నీటి ప్రాంతంలో భక్తులు దిగే సమయంలో ఎటువంటి ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకున్నామని, శివరాత్రి పుణ్యస్నానాలు పూర్తి అయ్యేవరకు నిరంతరం బోట్లలో గజ ఈతగాళ్లు పహారా నిర్వహించనున్నట్లు ఆమె తెలిపారు. వచ్చే భక్తులు ఎటువంటి అసౌకర్యం ఏర్పడకుండా అన్ని శాఖ అధికారులతో తగు జాగ్రత్తలు తీసుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంటీఎంసీ సెక్రటరీ శ్రీనివాసరావు, ఏఈ కిషోర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శివప్రసాద్ పాల్గొన్నారు.



పుష్కరఘాట్లను పరిశీలిస్తున్న ఎంటీఎంసీ కమిషనర్ శారదాదేవి, వివిధ శాఖల అధికారులు

సాంకేతికతను అందిపుచ్చుకోవాలి

బయో ట్విచ్ కంపెనీ సీఈఓ చక్రధర్ పెరంబదూర్

మోతడక(తాడికొండ): నేటి ఆధునిక జీవన శైలికి అనుగుణంగా బోధనలో వస్తున్న సాంకేతిక నైపుణ్యాలను అందిపుచ్చుకుంటే ఉన్నత విజయాలు సాధించవచ్చని బయో ట్విచ్ కంపెనీ సీఈఓ చక్రధర్ పెరంబదూర్ అన్నారు. మోతడక చలపతి ఇంజినీరింగ్ కళాశాలలో విద్యార్థులకు నూతన సాంకేతిక అంశాలపై నిర్వహించిన సెమినార్‌కు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఆయన మాట్లాడుతూ విదేశాలలో మంచి కొలువులు సాధించాలంటే ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్, ఆగ్మెంటెడ్ వర్చువల్ అండ్ వర్చువల్ రియాలిటీ, చాట్ జీపీటీపై పట్టు సాధించాలన్నారు. బోధనలో నూతన విధానాలు, విద్యా రంగంలో నూతన సాంకేతితపై వివరించి విద్యార్థులు ఏకాగ్రతతో చదివి ఉన్నత లక్ష్యాలు సాధించాలని సూచించారు. ముఖ్య అతిథిని ప్రిన్సిపాల్ డాక్టర్ వి.రంగారావు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.నాగ శ్రీనివాసరావు సత్కరించారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న బయో ట్విచ్ కంపెనీ సీఈఓ చక్రధర్ పెరంబదూర్

హత్య కేసులో నిందితుల అరెస్ట్

అనుమానాస్పద మృతి మిస్టరీని ఛేదించిన పోలీసులు

తెనాలి రూరల్: ఆత్మహత్యగా భావించిన అనుమానాస్పద మృతి కేసు మిస్టరీని పోలీసులు ఛేదించారు. మాయ మాటలు చెప్పి ఓ వ్యక్తిని నమ్మకంగా తమ వెంట తీసుకెళ్లి నగదు కోసం హత్య చేసిన ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. స్థానిక డీఎస్పీ కార్యాలయంలో శుక్రవారం రాత్రి ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో డీఎస్పీ డాక్టర్ కె.స్రవంతిరాయ్ వివరాలను వెల్లడించారు. ఆమె కథనం ప్రకారం.. ఈ నెల 6న తెనాలి మండలం కఠెవరం గ్రామ చెరువులో గుర్తు తెలియని మృతదేహం ఉందన్న సమాచారం రావడంతో రూరల్ ఎస్ఐ చిరుమామిళ్ల వెంకటేశ్వర్లు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతుడి సెల్‌ఫోన్ ఆధారంగా కుటుంబ సభ్యులకు సమాచారమందించారు. మృతుడిని గుంటూరు కొరిటిపాడుకు చెందిన పెద్దింటి వెంకటశ్రీకాంత్(36)గా గుర్తించారు. కుటుంబ కలహాల నేపథ్యంలో గుంటూరులో ఒక్కడే నివసిస్తున్నాడు. 5వ తేదీన తెనాలి వచ్చిన అతడు 6వ తేదీ ఉదయం కఠెవరం చెరువులో మృతి చెంది పడి ఉన్నాడు. తన కుమారుడు మద్యం మత్తులో చెరువులో పడి మృతి చెంది ఉంటాడని మృతుడి తల్లి అనసూయ పోలీసులకు ఫిర్యాదు చేసింది. దర్యాప్తు చేసిన పోలీసులు పూర్తి వివరాలు రాబట్టగలిగారు. తెనాలిలోని బంధువుల ఇంటికని వచ్చిన శ్రీకాంత్ ఇక్కడి నాజరుపేట నుంచి నడుచుకుంటూ కబేళా వంతెన వద్దకు వెళ్లాడు. అక్కడ ఆటో మాట్లాడుకుని మార్కెట్ ఏరియాలోని బార్‌కు వెళ్లినట్టు పోలీసుల విచారణలో తెలిసింది. బార్ వద్ద ఇద్దరు వ్యక్తులు పరిచయమై, అతనికి మాయమాటలు చెప్పి తమ ఆటోలో ఎక్కించుకుని కఠెవరం తీసుకెళ్లినట్టు గుర్తించారు. వీరిద్దరి ఆచూకీ కోసం యత్నించగా, వైకుంఠపురం పోతురాజు కాలనీకి చెందిన అన్నం రమేష్, చినరావూరు రైల్వేస్టేషన్ ప్రాంతానికి చెందిన కె. మాధవ్‌లుగా తేలింది. శ్రీకాంత్‌ను తమ వెంట తీసుకెళ్లి అతని జేబులో ఉన్న రూ.600 లాక్కోవడంతో పాటు ఫోన్‌పే ద్వారా నగదు బదిలీ చేయాలని డిమాండ్ చేసి శ్రీకాంత్‌పై దాడి చేశారు. అపస్మారక స్థితిలో ఉన్న అతన్ని చెరువులో పడేసి ఆటోలో వెళ్లిపోయారు. ఆటోను పోలీసులు గుర్తించకుండా ఉండాలని దాని పైన ఉండే కవరును మార్చి తప్పించుకుని తిరుగుతున్నారు. నిందితుల కదలికలపై నిఘా పెట్టి పోలీసులు చివరకు అదుపులోకి తీసుకున్నారు. ఘటనాస్థలం వద్ద ఎటువంటి ఆధారం లేకపోయినా కేసును అతి త్వరగా దర్యాప్తు చేసి నిందితులను అదుపులోకి తీసుకున్న రూరల్ సీఐ కె.శ్రీనివాసరెడ్డి, ఎస్ఐ సిహెచ్.వెంకటేశ్వర్లు, హెడ్‌కానిస్టేబుళ్లు వి.రవి, పి.మణికుమార్, డి.శివరామకృష్ణ, రాములను డీఎస్పీ అభినందించారు.

20న గ్రహణ మొర్రికి స్క్రీనింగ్ క్యాంపు

తాడికొండ: గ్రహణ మొర్రి(పెదవి చిలుక మరియు అంగిలి చిలుక)కి స్క్రీనింగ్ క్యాంపు ఈ నెల 20వ తేదీన గుంటూరులో నిర్వహించనున్నట్లు ఎంఈఓ తెనాలి ఇందిర తెలిపారు. 6 నెలల వయస్సు నుంచి 50 సంవత్సరాల వయస్సు ఉన్న వారు అందరూ ఈ క్యాంపునకు హాజరై పరీక్షలు చేయించుకోవచ్చన్నారు.

పొగడవృక్ష వాహనంపై మల్లేశ్వరుని గ్రామోత్సవం



మంగళగిరి: నగరంలో వేంచేసియున్న గంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఎనిమిదో రోజైన శుక్రవారం స్వామి వారు పొగడ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఆయా కూడళ్లలో భక్తులు మల్లేశ్వరుని దర్శించుకుని టెంకాయలు సమర్పించుకుని హారతులిచ్చారు. దేవస్థానం వద్ద నుంచి ప్రారంభమైన స్వామి గ్రామోత్సవం మెయిన్ బజారు మీదుగా శాసన స్తంభం, పూల మార్కెట్ మీదుగా మిద్దె సెంటర్‌కు చేరింది. అనంతరం అక్కడి నుంచి పెద కోనేరు మీదుగా తిరిగి దేవస్థానానికి చేరింది. నగరానికి చెందిన జంజనం ప్రసన్న కోటేశ్వరరావు, అనిత దంపతులు స్వామి పొగడవృక్ష వాహన ఉత్సవానికి కైంకర్యపరులుగా వ్యవహరించగా దేవస్థాన ఈఓ అన్నపురెడ్డి రామకోటిరెడ్డి పర్యవేక్షించారు.

రెండు ఇసుక ట్రాక్టర్లు సీజ్

పెదకొండూరు(తాడేపల్లి రూరల్): దుగ్గిరాల మండల పరిధిలోని పెదకొండూరు వద్ద శుక్రవారం రాత్రి దుగ్గిరాల పోలీసులు రెండు ఇసుక ట్రాక్టర్లను సీజ్ చేశారు. ఎస్ఐ శ్రీనివాసులురెడ్డి తెలిపిన వివరాలు.. కృష్ణానదిలో నుంచి ఎటువంటి బిల్లులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్నారని సమాచారం రావడంతో పెదకొండూరు ఆంజనేయస్వామి వద్ద రెండు ఇసుక ట్రాక్టర్లు రావడాన్ని గుర్తించి వాటిని సీజ్ చేసినట్లు చెప్పారు. ఆ ట్రాక్టర్లు నడుపుతున్న డ్రైవర్లు అత్తోట జోజిబాబు, సుద్దపల్లి అనీల్ కుమార్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

విద్యార్థులు పౌష్టికాహారం తీసుకోవాలి

తాడేపల్లి రూరల్: పట్టణ పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పౌష్టికాహారంపై అవగాహన సదస్సు శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాయన సుబ్బారావు మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని అందరూ తీసుకోవాలని అన్నారు.

నిర్మలా ఫార్మసీలో ఫ్రెషర్స్ డే వేడుకలు




మంగళగిరి: నగర పరిధిలోని ఆత్మకూరు నిర్మలా ఫార్మసీ కళాశాలలో ఫ్రెషర్స్ డే వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో రెవరెండ్ సిస్టర్ సుందరి మాట్లాడుతూ విద్యార్థులకు క్రమశిక్షణ, ఏకాగ్రత, నైపుణ్య లక్షణాలు చాలా అవసరమన్నారు. కళాశాల సెక్రటరీ సిస్టర్ నిర్మల జ్యోతి మాట్లాడుతూ విద్యార్థులు భవిష్యత్‌లో ఎదగాలంటే చదువుతో పాటు భావ వ్యక్తీకరణ నైపుణ్యాలు కూడా ఎంతో అవసరమన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అబ్దుల్ రెహ్మాన్, డాక్టర్ అంజన, డాక్టర్ వినయ్‌కుమార్, డాక్టర్ పాముల రెడ్డి, డాక్టర్ పద్మావతి, సాయిశ్రీ లక్ష్మి, ప్రశాంతి, జోజిబాబు, పావని, లక్ష్మీకాంత, దీప్తి పాల్గొన్నారు.

పేరేచర్ల రైస్‌మిల్లులో చోరీ

మేడికొండూరు: మండలంలోని పేరేచర్ల– సత్తెనపల్లి రోడ్డులోని విఘ్నేశ్వర రైస్ మిల్లులో శుక్రవారం తెల్లవారుజామున చోరీ ఘటన చోటుచేసుకుంది. గుర్తు తెలియని వ్యక్తులు రాత్రి సమయంలో రైస్‌మిల్లు వద్దకు వచ్చి మిల్లు వెనుక భాగాన ఉన్న ఇనుప గ్రిల్స్ తొలగించి లోపలకు ప్రవేశించారు. కౌంటర్ వద్ద ఉన్న బీరువా పగులగొట్టి బీరువాలోని రూ.5వేలు దొంగిలించారు. రైస్ మిల్లులో భద్రత కోసం ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలకు సంబంధించిన హార్డ్‌డిస్కును ఎత్తుకెళ్లారు. మిల్లు తెరిచేందుకు వచ్చిన యాజమాన్యం లోపలి వస్తువులు చిందర వందరగా పడి ఉండటంతో చోరీ జరిగిందని భావించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. మేడికొండూరు పోలీసులు చోరీ జరిగిన ప్రాంతాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. గతంలో ఇదే మిల్లులో జరిగిన చోరీలో రూ.50వేలు నగదు గుర్తుతెలియని వారు చోరీ చేశారు.

పంటలను రెండు రోజుల్లో తొలగించాలి

స్పెషల్ డెప్యూటీ కలెక్టర్ సాయిబాబు ఆదేశం



మంగళగిరి: సీఆర్‌డీఏ పరిధిలో రైతులు అనధికారికంగా సాగు చేస్తున్న పంటలను రెండు రోజుల్లో తొలగించాలని స్పెషల్ డెప్యూటీ కలెక్టర్ పి.సాయిబాబు ఆదేశించారు. సీఆర్‌డీఏ పరిధిలోని కురగల్లు, నీరుకొండ, నిడమర్రు, నవులూరు, బేతపూడి, యర్రబాలెం, కృష్ణాయపాలెం గ్రామాల్లో శుక్రవారం పర్యటించారు. ఆయా ప్రాంతాల్లోని రైతులు తమ భూములను సీఆర్‌డీఏ వారికి ల్యాండ్ పూలింగ్‌కు ఇచ్చి ప్రతి సంవత్సరం కౌలు పొందుతూ అనధికారికంగా సాగుచేస్తున్న పంటలను పరిశీలించారు. రైతులు అనధికారికంగా సాగు చేస్తున్న పంటలను రానున్న రెండు రోజుల్లో తొలగించాలని, లేకుంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

క్షయ వ్యాధిపై అవగాహన

దుగ్గిరాల(తాడేపల్లి రూరల్): స్థానిక ఐటీఐలో క్షయ వ్యాధిపై అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తేజస్విని రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ స్వచ్ఛంద సంస్థ చైర్మన్ పుల్లయ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో ఐటీఐ ప్రిన్సిపాల్ ఉమామహేశ్వరరావు, దుగ్గిరాల ప్రాథమిక ఆరోగ్యకేంద్ర సీహెచ్ఓ హిమాంబి, పీహెచ్ఎన్ జీనమ్మ పాల్గొన్నారు.

చంద్రబాబుకు ప్రజలే బుద్ధి చెబుతారు

వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త సురేష్‌కుమార్



తాడికొండ: రాష్ట్రాభివృద్ధికి అడ్డుపడుతున్న మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబుకు ప్రజలే బుద్ధి చెబుతారని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ అదనపు సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం గుంటూరులోని తన కార్యాలయంలోవిలేకరులతో మాట్లాడారు. ప్రజల కష్టాలను గాలికొదిలేసిన చంద్రబాబు కనీసం అసెంబ్లీలో ప్రజా సమస్యలను ప్రస్తావించకుండా రాజకీయాలను కలుషితం చేశాడని ఎద్దేవా చేశారు. విశాఖ కేంద్రంగా నిర్వహించిన గ్లోబల్ సమ్మిట్ విజయవంతమై నేడు ఐటీ కేంద్రంగా విశాఖ నగరం అభివృద్ధి చెందేందుకు బంగారు బాటలు పడ్డాయని, విశాఖతో పాటు అమరావతి, రాయలసీమ ప్రాంతాలను కూడా అభివృద్ధి చేసేందుకు ముఖ్యమంత్రి పక్కా ప్రణాళికతో ముందుకెళుతున్నారని చెప్పారు. రాష్ట్ర ప్రజలు నేడు సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పాలన చూసి నూటికి నూరుశాతం సంతృప్తిగా ఉన్నారని, దేశంలోనే ఏ ముఖ్యమంత్రి అమలు చేయని విధంగా సంక్షేమాన్ని ఒక్క రూపాయి అవినీతి జరగకుండా నేరుగా రాష్ట్ర ప్రజల ఖాతాల్లోకి మళ్లించిన జగనన్న 175 నియోజకవర్గాల్లో విజయం సాధించడం ఖాయమన్నారు. బాబు రాష్ట్రం సంగతి దేవుడెరుగు నువ్వు కుప్పంలో, నీ కుమారుడు మంగళగిరిలో పోటీచేసి గెలుస్తారో లేదో ఓసారి వెనక్కి తిరిగి ఆలోచించుకోవాలని ఆయన హితవు పలికారు.

ప్రజలకు మహా శివరాత్రి శుభాకాంక్షలు

తాడికొండ: నియోజకవర్గ ప్రజలకు వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్ మహా శివరాత్రి శుభాకాంక్షలు తెలిపారు. మహా శివరాత్రి పర్వదినాన్ని ప్రజలంతా భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని కోరారు. వారు చేసే ఉపవాస దీక్షతో సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. పరమ శివుని అనుగ్రహంతో ప్రభుత్వ పాలన, సంక్షేమ కార్యక్రమాలు ప్రజలకు అద్భుతంగా అందుతున్నాయని చెప్పారు.

బాల్య వివాహాల కట్టడికి సహకరించండి

సీడీపీఓ సింహాచలం

మోతడక(తాడికొండ): బాల్య వివాహాలు చేయాలని ప్రయత్నిస్తే ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా తీసుకొని 1098, 181 టోల్ ఫ్రీ నంబరుకు సమాచారం ఇవ్వాలని తాడికొండ ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ సింహాచలం అన్నారు. శుక్రవారం తాడికొండ మండలం మోతడక ఉన్నత పాఠశాలలో బాలికా వివాహాలపై నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఆడపిల్లలకు 18 సంవత్సరాలు, మగ పిల్లలకు 21 ఏళ్లు నిండకుండా వివాహం చేస్తే రూ. లక్ష జరిమానా, జైలు శిక్ష ఉంటుంది హెచ్చరించారు. బాల్య వివాహాల కట్టడి ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ తెనాలి ఇందిర, పర్యవేక్షకులు సీహెచ్ వెంకటేశ్వరమ్మ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీడీపీఓ సింహాచలం

లింకురోడ్ల నిర్మాణం పూర్తిచేయాలి

ఎమ్మెల్యే ఉండవల్లి శ్రీదేవి



తాడికొండ: నియోజకవర్గ పరిధిలోని పలు గ్రామాల్లో ఉన్న లింకు రోడ్ల టెండర్లు పూర్తి చేసి వెంటనే పనులు ప్రారంభించాలని ఎమ్మెల్యే డాక్టర్ ఉండవల్లి శ్రీదేవి సూచించారు. శుక్రవారం గుంటూరులోని తన కార్యాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మేడికొండూరు మండలం పేరేచర్ల గ్రామంలో మైనార్టీ వెల్ఫేర్ ద్వారా రూ.4.5 కోట్లతో ఏర్పాటు చేయనున్న పోస్ట్ యూనివర్సిటీ జూనియర్ కాలేజ్ ఫర్ మైనార్టీ కళాశాలకు టెండర్లు ప్రక్రియ పూర్తి చేసి త్వరలో పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.